అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు..

కొనసాగుతున్న ఇసుక తవ్వకాలు

ప్రజాశక్తి-విజయపురం(నగరి): ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఇసుక కొరతను ఆసరాగా చేసుకుంటున్నారు. కుశస్థలి నదిలో పగటిపూట మాత్రమే ఇసుక తీసుకోవచ్చని, జేసీబీలు వాడి ఇసుక లోడ్ చెయ్యకుండా మనుషుల్ని పెట్టి లోడ్ చేసుకోవాలని అనుమతులు ఇచ్చేశారు. ఇదే అదనుగా భావించి రవాణాదారులు పెట్రేగిపోతున్నారు. ఎక్కడ పడితే అక్కడ ఇసుకను తవ్వి తరలించేసి సొమ్ము చేసుకుంటున్నారు. శ్మశానాలకు అతి సమీపంగా వెళ్లి శ్మశానానికి వెళ్లే దారులను కూడా తవ్వేస్తున్నారు. మండలంలోని తెరణి గ్రామంలో ఈ పరిస్థితి నెలకొంది. శ్మశానానికి వెళ్లే దారిని ఇసుక తరలింపుదారులు లోడేయడం, దారి కుంగిపోయేస్థితికి చేరుకోవడంతో గ్రామస్థులు ఆగ్రహించారు. ఇది వరకే ఇలాంటి సంఘటన జరిగి అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. ట్రాక్టర్ యజమానులు ఇచ్చే లంచానికి అలవాటు పడి అధికారులు నిద్రబోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు పాటించరా.?

ఇసుక భవన నిర్మాణాలకు అవసరమే అలాగే నిబంధనలను కూడా చాలా అవసరమని తెరని గ్రామస్తులు అన్నారు. తెరని నుంచి రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక తరలిస్తున్నారు. ఉదయం 3గంటల నుంచి రాత్రి 8గంటల వరకు నిర్విరామంగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపించారు. సత్రవాడ – తెరని మధ్యలో కుశస్థలి నదిపై వంతెన ఉంది. వంతెనకు 500మీటర్ దూరంలో ఇసుక తవ్వకాలు జరగాలని అధికారులు నిబంధనలు విధించారు. అయితే ట్రాక్టర్ యాజమాన్యం ఆ నిబంధనను పాటించకుండా ఇసుకను అక్రమంగా తవ్వేస్తున్నారు. దీంతో వంతెన ప్రమాదకరంగా మారడంతో పాటు, తెరని స్మశానానికి వెళ్లే దారిని సైతం తవ్వే సారిని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా వంతెన ప్రమాదకరంగా మారిందని, వంతెన స్తంభాలు చుట్టూ ఇసుకను తవ్వేయడంతో, ఏ క్షణంలో కూలిపోతుందో తెలియదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- **కనుమరుగవుతున్న తెరణి శ్మశానం**
- **ఇసుక తోడేస్తే ఎలా అంటూ స్థానికుల నిలదీత**
- **ప్రభుత్వమే అనుమతిచ్చిందని వాదిస్తున్న ఇసుక తరలింపుదారులు**

అధికారులు పట్టించుకోవడం లేదు

మా గ్రామంలో అక్రమ ఇసుక రవాణా విచ్చలవిడిగా ఉంది. వంతెన వద్ద తవ్వేయడంతో ప్రమాదకరంగా మారింది. అక్రమ ఇసుక రవాణాను పలుమార్లు అడ్డుకున్నాం. అధికారులకు కూడా చెప్పాం. కానీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇక్కడ ఉన్న అధికారులను మేం నమ్మం. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. లేకుంటే ధరణి వంతెన కూలిపోయే ప్రమాదం ఉంది.

- తంగారాజ్, తెరని గ్రామం

ఇసుక సరే.. శ్మశానానికి దారి ఎక్కడ..

ఇల్లు నిర్మాణం చేపట్టడానికి ఇసుక అవసరమే అందుకోసం శ్మశానంకి వెళ్లే దారిని తోడేస్తే చూస్తూ వేలా ఊరుకోమంటారు. జిల్లా అధికారులు రీచ్ ఏర్పాటు చేసి అక్కడ ఇసుక తీసుకునేలా చర్యలు చేపట్టాలి. ఇలా ఎక్కడబడితే అక్కడ ఇసుక తీయడం ద్వారా శ్మశానాలు కనుమరుగవైపోతా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నాను.

- లోకేష్, తెరని గ్రామం

జాతీయ రహదారిపై ధర్నా చేస్తాం..

తరనిలో అక్రమ ఇసుక రవాణా అడ్డుకట్ట లేకపోయింది. అధికారులకు పలుమార్లు చెప్పాం, కానీ ఏమాత్రం పట్టించుకోలేదు. ఫలితంగా ఆ గ్రామంలో శ్మశానం కనుమరుగవుతా ఉంది. ఇకనైనా అక్రమ ఇసుక రవాణాను అధికారులు అడ్డుకోకపోతే జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ధర్నా చేస్తాం.

- వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యం పెంచడానికి చర్యలు

రుచికరమైన భోజనం అందించండి: కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధపెట్టి పని చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం క్షేత్ర స్థాయిలో పర్యటనలో భాగంగా కలెక్టర్ పులిచెర్ల మండలం కల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా మధ్యాహ్న భోజన పథకం, ఆర్‌ఓ ప్లాంట్ పనితీరు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టిక పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంచడంలో భాగంగా క్రమంతప్పకుండా పాఠశాలకు హాజరు అయ్యే అంశంపై దృష్టి పెట్టాలని, పాఠశాలకు హాజరుకాని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా రుచికరంగా భోజనాన్ని అందించేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ పాఠశాలలో స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ కింద అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పులిచెర్ల మండలం ముతుకువారిపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, ఎంపిడిఓ రాజశేఖర్, హెచ్‌ఎం శ్రీవాణి పాల్గొన్నారు.

పలు సమస్యలపై అర్జీ అందిస్తున్న టిడిపి నాయకులు

తహశీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-సోమల: సోమల తహశీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో శాఖల వారీగా అధికారులతో రివ్యూ నిర్వహించారు. ప్రగతి నివేదికలను విని పలు సూచనలు ఇచ్చారు. హౌసింగ్ బిల్లులు లబ్ధిదారులకు సకాలంలో వస్తున్నాయా, ఉపాధి హామీ పథకంలో వేతన దారులకు సకాలంలో బిల్లులు మంజూరు అవుతున్నాయా, వెలుగు పంచాయతీరాజ్ రెవెన్యూ తదితర శాఖల అధికారులతో మాట్లాడి వారి వద్ద నుండి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, శ్రీనివాసులు నాయుడు కలెక్టర్‌ను కలిసి వల్లిగట్ల పెద్ద చెరువు భారీ వర్షాలకు మరొక తెగిపోయి ఏళు గడుస్తున్న ఇంతవరకు మరమ్మతులు చేయలేదని, సోమల నుండి పెద్ద ఉప్పరపల్లి వరకు అధ్వానంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీవో నారాయణ, పలు శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

మద్యం పరిశ్రమలో సిఐడి అధికారుల సోదాలు

మద్యం పరిశ్రమలో సోదాలు చేస్తున్న అధికారులు

గుడిపాల మోహన్ డిస్టలరీ కంపెనీలో సోదాలు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం పట్టణం డీకే పల్లి పరిధిలోని మద్యం పరిశ్రమలో సిఐడి అధికారులు అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి నేతృత్వంలో తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా సంస్థలోని పలు రికార్డులను, మద్యం తయారీ పద్ధతిని పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పద్యం పరిశ్రమలలో సిఐడి సోదాలు ప్రారంభించారని, ఇందులో భాగంగా కుప్పం పట్టణ పరిధిలోని మద్యం పరిశ్రమలో సైతం సోదాలు చేపట్టినట్టు సమాచారం. కార్యక్రమంలో స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాల మోహన్ డిస్టలరీలో..

- **పలు రికార్డులు స్వాధీనం**

ప్రజాశక్తి-గుడిపాల: గుడిపాల మండలంలోని మోహన్ బేవరేజ్ అండ్ డిస్టలరీ లిమిటెడ్ సంస్థ(ఓరియన్ ఫ్యాక్టరీ)లో సిఐడి అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. ఏపీ సిఐడి డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ డిజిటల్ రికార్డులు, ఆఫీసు కంప్యూటర్ల రికార్డ్స్‌ను, 2019 నుండి 2024 జరిగిన లావాదేవీలను పరిశీలించారు. రా మెటీరియల్స్ అయినా స్పిరిట్, ఎంప్టీ బాటిల్స్, అట్టపెట్టలు ఎక్కడనుండి దిగుమతి చేసుకుంటున్నారు. అదేవిధంగా తయారైన మద్యాన్ని ఎక్కడికి ఎగుమతి చేస్తున్న అనే విషయాలపై సిఐడి ఆరా తీశారు. యాజమాని చెన్నైలో ఉన్నారని ప్రస్తుతం ఇక్కడ మేనేజర్ గోపాల్ ఈ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో నడుస్తున్నాయని వారు తెలిపారు. ఇక్కడ ఓల్డ్ మంక్ రమ్, మ్యాజిక్ మూమెంట్స్ వోడ్కా, రాయలసీమ విస్కీ మూడే బ్రాండ్లు తయారు చేస్తున్నారన్నారు. గల ప్రభుత్వంలో జరిగిన మద్యం అవకతవకలపై రాష్ట్ర వ్యాప్తంగా ఈ దాడులు నిర్వహిస్తున్నట్లు డిఎస్పి తెలిపారు. ఫ్యాక్టరీలోనికి సిఐడి అధికారులు మీడియాను అనుమతించ లేదు. ఈ సోదాల్లో స్థానిక పోలీసులు, రెవిన్యూ ఇబ్బందులు ఉన్నారు.

నిబంధనల ఉల్లంఘనలపై నిఘా

- **చిత్తూరులో ట్రాఫిక్ ఆంక్షలు మరింత కఠినతరం**
- **సీసీ కెమెరాల నిఘాతో వాహనాలకు జరిమానాలు**

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నియమాలను పాటించకపోతే, కఠిన చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు చెబుతున్నారు. పోలీస్ ఫాల్కన్ వాహనం ద్వారా ప్రత్యక్షంగా మాత్రమే కాకుండా, పరోక్షంగా కూడా సమర్థవంతంగా పనిచేసేలా పోలీస్ శాఖ ట్రాఫిక్ నిబంధనలు కఠిన తరం చేస్తూ ఫాల్కన్ వాహనం అందుబాటులోకి తీసుకొచ్చింది. చిత్తూరు నగరంలో ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఈ వాహనం ద్వారా నిఘా ఉంచి నియమాలు పాటించని వారిపై అపరాధ రుసుము విధించనున్నారు. అలాగే సీసీ కెమెరాల్లో త్రిబుల్ రైడింగ్, రోడ్ క్రాసింగ్ సమయాల్లో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తీసుకోనున్నారు.

సీసీ కెమెరాల్లో పర్యవేక్షిస్తున్న పోలీసులు

సీసీ కెమెరాల నిఘా..

ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలపై కేవలం నేరుగా మాత్రమే కాకుండా, జిల్లాలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా కూడా నిఘా ఉంచి, జరిమానాలు విధించబడతాయని పోలీసులు చెబుతున్నారు. ముఖ్యంగా ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, మొబైల్ ఫోన్ డ్రైవింగ్, నెంబర్ ప్లేట్ లేదా సరైన పత్రాలు లేని వాహనాలు, వేగవంతమైన లేదా నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమని స్పష్టం చేస్తున్నారు. ఫాల్కన్ వాహనంలో ఉన్న కెమెరాలు ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తున్న ప్రజలపై జరిమానా విధించడానికి ఉపయోగించనున్నారు. "నియమాలను పాటించడం ప్రతి మనిషి బాధ్యత" ఈ విధానం ద్వారా, చిత్తూరు నగరంలో ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా అమలు చేయడం కంటే ప్రజల భద్రతను పెంచడంలో ఇది ఒక కీలక సాధనంగా నిలువనుంది. ఈ వాహనాన్ని ఉపయోగించడం ద్వారా "సరైన దిశలో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించనున్నారు.

నగరంలో ఏర్పాటు చేసిన ఫాల్కన్ వాహనం

మైనర్లకు వాహనాలు ఇవ్వద్దు

మైనర్‌లు వాహనాలు నడపడం పూర్తిగా నిషేధించబడిందని, ఎవరైతే మైనర్‌లకు వాహనాలు ఇస్తారో వారే శిక్షించబడతారని, "ట్రిపుల్ రైడింగ్, మొబైల్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలు మీ జీవితాలకు ముప్పు కలిగిస్తాయి. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటించి, చిత్తూరు జిల్లాలో రోడ్డు భద్రతకు సహకరించాలని పోలీస్ శాఖ సూచిస్తోంది. ట్రాఫిక్ నియమాలు ఉల్లంగిస్తూ ఎవరైనా కనిపిస్తే వారు నడుపుతున్న వాహన నెంబర్ ప్లేట్ కనిపించే విధంగా ఫోటో లేదా వీడియోను ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నెంబర్ 9491074515కు పంపాలి ఇలా పంపిన వారి వివరాలను గోప్యంగా ఉంచనున్నారు.

ఆరోగ్య భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించండి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ఆరోగ్య భద్రతపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలని డీఎంహెచ్‌వో ప్రభావతీ దేవి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని తూగుండ్రం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, బంగారెడ్డిపల్లి ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా రాబోయే మూడు రోజులు అధిక వర్షాపాతం నమోదు అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ఉద్యోగులు, సిబ్బంది సెలవు ఇవ్వకూడదన్నారు. పీహెచ్‌సీలో మందుల నిల్వ

డాక్టర్‌లతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ల్యాబ్ టెస్టింగ్, డెలివరీలు, పలు రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు దివ్య, మౌనిక, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుండపోత

- ఉప్పొంగిన వంకలు, వాగులు
- జోరుగా ప్రవహిస్తున్న నదులు
- పలు చోట్ల తెగిన వంతెనలు, కల్వర్టులు
- గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- నయనానందకరంగా గార్గేయ నది ప్రవాహం

సదుం వద్ద నయనానందకరంగా గార్గేయ నది ప్రవాహం

తెగిన కల్వర్టు

కల్వర్టు తెగిపోవడంతో స్తంభించిన రాకపోకలు

నది వద్ద పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-సోమల, సదుం: తుపాన్ ప్రభావంతో కురిసిన కుండపోత వార్షానికి వంకలు, వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. అటవీ ప్రాంతాల నుంచి వచ్చిన నీటికి గార్గేయ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమల, సదుం మండలాల్లో సోమవారం రాత్రి 9గంటల నుంచి 11:30గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో గార్గేయ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పచ్చటి ప్రకృతి సౌందర్యం నడుమ జలజల ప్రవహిస్తున్న గార్గేయ నది నయనానందకరంగా ఉంది. పలు చెరువులు, కుంటలు, వాగులు నీటితో కళకళలాడుతున్నాయి. నది ప్రవాహాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు.

పలు చోట్ల తెగిన వంతెనలు, కల్వర్టులు

సోమవారం రాత్రి పెద్ద ఉప్పరపల్లి అటవీ ప్రాంతంలో కురిసిన వర్షానికి గార్గేయ నది ఉధృతంగా వర్షపు నీటితో ప్రవహించింది. మూడు రోజుల పాటు అహర్నిశలు శ్రమించి నిర్మించిన తాత్కాలిక కల్వర్టు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో గత మూడు రోజుల క్రితం గురువారం రాత్రి కురిసిన వర్షానికి కొట్టుకుపోయిన కల్వర్టు ప్రాంతంలో నూతనంగా నిర్మించిన కల్వర్టు కూడా వరద ఉధృతికి మళ్లీ తెగిపోయింది. ఏడు గ్రామాలకు చెందిన దాదాపు వందలాది కుటుంబాల వారు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాగా గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు సోమల నుంచి నంజంపేట మార్గ మధ్యలోని జీడి రేవుల వంక వద్ద వరద ఉధృతికి కల్వర్టు కొట్టుకుపోవడంతో అప్పట్లోనే పైపులను ఏర్పాటు చేసి తాత్కాలిక కల్వర్టు నిర్మించారు. ఇన్ని రోజులు తాత్కాలిక కల్వర్టు ప్రజలకు సేవలు అందించి రాత్రి కురిసిన వర్షానికి దాదాపు 60శాతం కొట్టుకుపోయింది. కేవలం ద్విచక్ర వాహనాలు మాత్రమే రాకపోకలు సాగిస్తూ భారీ వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోయింది. ఆవులపల్లి – 81 చిన్న ఉప్పరపల్లి – నంజంపేట – పెద్ద ఉప్పరపల్లి పేటూరు – అన్నెమ్మ గారి పల్లి పంచాయతీలకు రాకపోకలు సోమల నుంచి నిలిచిపోయాయి.

కల్వర్టు పరిశీలించిన ఎస్‌ఈ

బసవ పల్లి వద్ద నిర్మించిన తాత్కాలిక కల్వర్టు వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో చిత్తూరుకు చెందిన పంచాయతీరాజ్ ఎస్‌ఈ శంకర నారాయణ, పిఐయు ఇఇ నాగరాజు వ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ప్రజాశక్తితో మాట్లాడుతూ దాదాపు పూర్తిగా కల్వర్టు నిర్మాణం అయిన తర్వాత అనుకోకుండా వచ్చిన భారీ వర్షం గార్గేయ నది ఉధృతంగా ప్రవహించడం వల్ల పైపులు అలాగే ఉన్నాయని డ్యామేజీ కాలేదని కేవలం ఇసుక బస్తాలు పైన తోలిన మట్టి కొట్టుకుపోయాయని, వరద ఉధృతి తగ్గగానే రెండు రోజుల్లో పనులు ప్రారంభించి మళ్లీ నిర్మాణం చేపడతామన్నారు. ప్రజలకు రాకపోకలు సాగించేందుకు సౌకర్యం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన పిఆర్ జేఈ ఆనంద్, గ్రామస్తులు ఉన్నారు.

సదుం మండలంలో ఇలా..

సోమల మండలం పెద్ద ఉప్పరపల్లిలో పుట్టిన గార్గేయ నది వరద ఉధృతంగా ప్రవహించడం వల్ల కొర్లగుంటవారిపల్లి ప్రాజెక్టు నిండి మొరవ నీరు జోరుగా ప్రవహించింది. నది ప్రవాహాన్ని చూడ్డానికి సదుం ప్రజలు దిగువ జాంద్రపేట బ్రిడ్జి పైన, కలికిరి రోడ్డు లోని సుబ్రమణ్య స్వామి ఆలయం వద్ద, గార్గేయ నదిపై నిర్మించిన బ్రిడ్జి పైన నుంచి చూడ్డానికి ప్రజలు ఎగబడ్డారు. మంగళవారం వర్షాలు ఏమీ లేకపోవడంతో సాయంత్రానికల్లా సదుం ప్రాంతంలో ప్రవహిస్తున్న గార్గేయ నది ఉధృతం తగ్గింది.

ఉధృతంగా బహుదా నది ప్రవాహం

- అరగొండ - సరకల్లు మార్గంలో తెగిన కల్వర్టు
- గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు
- అక్కడి పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్యే మురళీమోహన్
- యుద్ధప్రాతిపదికన కల్వర్టు పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశం

ప్రజాశక్తి-తవణంపల్లి: మండలంలో సోమవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా బాహుదా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. అరగొండ – సరకల్లు మార్గంలోని తొడతర వద్ద బాహుదా నదిపై నిర్మించిన కల్వర్ట్ తెగిపోవడంతో గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులతో సమాచారం తెలుసుకున్న పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అప్రమత్తమై యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అధికారులతో కలిసి తెగిన కల్వర్ట్‌ను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగంగా కల్వర్టు నిర్మించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. తెగిన కల్వర్ట్ వద్ద యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనులు చేస్తున్నారని, వీలైనంత త్వరగా రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నూతన కల్వర్ట్ ఏర్పాటుపై కలెక్టర్‌కు ప్రతిపాదన పంపి శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అరగొండ మార్గంలో తెగిన కల్వర్టు

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక లాభాలు

వ్యవసాయ శాఖ ఏడి మురళీకృష్ణ

ప్రజాశక్తి-శాంతిపురం: ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరించడం వల్ల పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఏడి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని 121 పెద్దూరు గ్రామంలో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెఎన్‌బిఎఫ్ సాగు విధానాలు రైతులు అలవారుచుకొని ఖర్చు తగ్గించి, నూతన వ్యవసాయ పద్ధతులతో మంచి దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. రసాయన ఎరువుల యూరియా, డిఏపికి ప్రభుత్వం అధిక సబ్సిడీ ఇస్తున్న విషయాలు, పీఎం కిసాన్, రైతు భరోసా ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకొని నగదు పొందాలని సూచించారు. అదేవిధంగా డీడీఏ నాగ పద్మిని మాట్లాడుతూ అడవిపందుల నివారణ చర్యలు, తీసుకొనే జాగ్రత్తలు, మెలుకువలు రైతులకు తెలిపారు. అనంతరం పలమనేరు ఏడీఏ అన్నపూర్ణ దేవి వివిధ పంటలలో ఎరువులు, పురుగు మందుల వాడకం, మోతాదు మించితే వాడకూడదని తెలిపి, రైతు సమస్యలను తెలపని కోరారు. మండల వ్యవసాయ అధికారి అపోజి అందుబాటులో ఉన్న ఎరువులు, ఉపయోగాలు వివరించారు. ఉద్యాన శాఖ అధికారి వింద్య మాట్లాడుతూ ఉద్యాన పంటలు వాటి సబ్సిడీ వివరాలు రైతులకు తెలిపారు. కర్యక్రమంలో జనసేనా అధ్యక్షులు మిల్లెట్ కిషోర్, మేటి రైతులు లోకేష్, బెందనకుప్పం పెద్దూరు రామకృష్ణ రెడ్డి, కృష్ణమూర్తి, సోమరామీ రెడ్డి, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీలకు ఆహ్వానం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్, (అర్హత ఎంఏ కామర్స్ ఉత్తీర్ణత అనుభవం), ఇంగ్లీషు (అర్హత ఎంఏ ఇంగ్లీష్ ఉత్తీర్ణత, అనుభవం) జువాలజీ (అర్హత ఎంఏ జువాలజీ ఉత్తీర్ణత, అనుభవం) ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకులను తీసుకోవడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, అనుభవం కలిగిన అభ్యర్థులు ఈనెల 26వ తేదీ లోపల కళాశాల ప్రిన్సిపాల్‌ని కలవాలని కోరారు.

పశు వైద్యాధికారిగా ప్రదీప్

డాక్టర్ ప్రదీప్

ప్రజాశక్తి-సదుం: మండల కేంద్రంలోని పశువైద్యశాల డాక్టర్‌గా ప్రదీప్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ సుబ్రమణ్యం పెనుమూరు ప్రభుత్వ పశు వైద్యశాలకు బదిలీపై వెళ్లారు. కెవి పల్లి మండలంలో పని చేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో డాక్టర్ ప్రదీప్ సదుంకు నియమితులైయ్యారు.

రక్తదానం సాటి మనిషికి ప్రాణదానం: డాక్టర్ ప్రభాకర్

ప్రజాశక్తి-పుంగనూరు: రక్తదానం సాటి మనిషికి ప్రాణదానమని కావున ప్రతి ఒక్కరు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తం దానం చేసి మరొకరి ప్రాణం కాపాడినట్లు అవుతుందని మానవతా సేవా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు డాక్టర్ ప్రభాకర్ అన్నారు. మానవత సేవాస్వచ్ఛంద సంస్థ, శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రోటరీ క్లబ్, ఎంసివి డిగ్రీ కళాశాలలతో కలిసి సంయుక్తంగా ఈనెల 24న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని మంగళవారం తెలిపారు. తమ రక్తాన్ని దానం చేయాలనే గొప్ప మనసును కలిగి రక్తదానం చేసేవారు మరొకరికి ప్రాణ బిక్ష పెట్టిన వారు అవుతారన్నారు. ఈ రక్తదాన శిబిరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో నిర్వహిస్తారన్నారు. యువతి, యువకులు, విద్యార్థులు, పెద్దలు మానవత దృక్పథంతో స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

'బాధితులకు అండగా ఉంటాం'

బాధితులను పరామర్శిస్తున్న మునిరత్నం

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలోని 2వ వార్డు చీగలపల్లి క్వారీలో చోటు చేసుకున్న ప్రమాద బాధితులకు అండగా ఉండి, అన్ని విధాల ఆదుకుంటామని ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబులు తెలిపారు. ఆదివారం చీగలపల్లి క్వారీలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించగా, గాయాల పాలైన ఇద్దరు వ్యక్తులు కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానిక టిడిపి నాయకులు బాధితులను పరామర్శించి, వారికి పార్టీ తరపున అండగా ఉండి, ప్రభుత్వం తరఫున బాధితులకు న్యాయం చేసి ఆదుకుంటామని భరోసా కల్పించారు.

ఏజీపీకి సత్కారం

ఏజీపీని సత్కరిస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-విజయపురం(నగరి): నూతనంగా ఎన్నికైన ఏజీపీ ఎంజె జగదీషన్‌ను నగరి బార్ అసోసియేషన్ సభ్యులు బార్ ఉపాధ్యక్షులు ఈజీ బాబు, సహ కార్యదర్శి అరుళ్ ఆధ్వర్యంలో సత్కరించారు. మంగళవారం కోర్టు ఆవరణలో జగదీష్‌ను కలిసిన వారు దుశ్శాలువాలతో, పూలదండలతో సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్ సుబ్రమణ్యం, ఎన్ మహదేవన్, కె వేలాయుధం, రాము, ధరణి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జెడ్పీ సీఈవో

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న జెడ్పీ సీఈవో

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని చిత్తూరు జెడ్పి సీఈవో రవికుమార్ నాయుడు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసి సన్మానించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై వారు చర్చించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బందితో పాటు టీడీపీ నాయకులు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- అధికారులను ఆదేశించిన విద్యుత్ ఈఈ శేషాద్రి రెడ్డి
- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పూతలపట్టు: విద్యుత్ శాఖ అధికారులు నిత్యం గ్రామీణ ప్రాంతాల పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషాద్రి రెడ్డి సిబ్బందికి సూచించారు. మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు విద్యుత్ శాఖ అధికారుల పనితీరును ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం ప్రజాశక్తి దినపత్రికలో 'విద్యుత్ శాఖ అధికారులు ఎక్కడ' అనే శీర్షిన వార్త వెలువడింది. పూతలపట్టు మండల ప్రజలు ప్రజా ప్రతినిధుల నుంచి ఇలాంటి సమస్యలు వస్తే కఠిన చర్యలు తప్పవని ఈఈ అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. వార్తకు స్పందించిన అధికారిని ప్రజలు అభినందించారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని చిన్న తయ్యూరు గ్రామ పరిధిలో నాటు స్థావరాలపై పోలీసులు మంగళవారం దాడులు చేపట్టారు. ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో సిబ్బంది రహస్య ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. చిన్న తయ్యూరు గ్రామ సమీపంలో సారా కాచేందుకు సిద్ధంగా ఉంచిన ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుమన్ మాట్లాడుతూ నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

- బాధితులకు భరోసాగా నిలవండి
- ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందిన ఫిర్యాదులు పరిష్కరించడంలో అలసత్వం వహించకుండా సకాలంలో పరిష్కారం చూపాలని సంబంధిత పోలీస్ అధికారులను ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల సమస్యలను నేరుగా విన్న ఆయన అక్కడికక్కడే సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో మొత్తం 27 ఫిర్యాదులు అందగా చీటింగ్ 1, కుటుంబ తగాదాలు 5, వేదింపులు 1, ఇంటి తగాదాలు 3, భూ తగాదాలు 8, డబ్బు తగాదాలు 6, ఆస్తి తగాదాలు 3 చొప్పున ఫిర్యాదులు అందినట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ సాయినాథ్ పాల్గొన్నారు.

కుప్పంలో డీఎస్సీ శిక్షణ ప్రారంభం

శిక్షణ మెటీరియల్ అందుకున్న అభ్యర్థులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో మంగళవారం డీఎస్సీ శిక్షణ కేంద్రాన్ని నారా భువనేశ్వరి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి వర్చువల్‌గా ప్రసంగిస్తూ, ఎన్‌టీఆర్ ట్రస్ట్ తరపున ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. ముఖ్యంగా విద్యార్థులకు అవసరమైన సేవలను అందించడానికి ట్రస్ట్ ఎప్పుడు ముందుంటుందన్నారు. అదేవిధంగా డీఎస్సీ అభ్యర్థులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం డీఎస్సీ అభ్యర్థులకు అవసరమైన మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు రాజ్ కుమార్, డాక్టర్ వెంకటేష్, గోపీనాథ్, భాగ్యలక్ష్మి త్రిలోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'వైజ్ఞానిక ప్రదర్శన'

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డీసీవో

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో మంగళవారం జిల్లా స్థాయి "వైజ్ఞానిక ప్రదర్శన" ఏర్పాటు చేశారు. జిల్లాలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల 7పాంశాలల విద్యార్థులు 104 మంది, 94 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. డీవైఈవో చంద్రశేఖర్, డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ రమణ, చిత్తూరు, తిరుపతి డీసీవోలు పద్మజా, లీలా రాణి ప్రదర్శనకు విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి పసంగించారు. విజేతులకు ప్రశంసా పత్రాలు, పతకాలను అందజేశారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి పరామర్శ

మృతుల కుటుంబాన్ని పరామర్శిస్తున్న వేణుగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి-సోమల: మండలంలోని నెల్లిమంద పంచాయతీ తెట్టుపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నూరుల్లా(38) ఆటో డ్రైవర్ తల్లి ఫకీరమ్మ(65) సోమవారం రాత్రి సుమారు 11గంటల ప్రాంతంలో అన్నమయ్య జిల్లా కలకడ మండలం ఇందిరమ్మ కాలనీ సమీపంలో వీరు వస్తున్న ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొన్న సంఘటనలో ఇరువురు మృతి చెందారు. ప్రమాద సంఘటనలో మొత్తం నలుగురు మృతిచెందగా సోమల మండలం నెల్లిమందకు చెందిన తల్లి కుమారుడు కూడా మృతి చెందారు. పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి మంగళవారం వారి ఇంటి వద్దకు చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భీష్మ, ఎంపీటీసీ నాగభూషణం రెడ్డి, వైసిపి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కదిలొచ్చారు.!

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

- దాసర్లపల్లి ఎస్టీ కాలనీ సమస్యలపై చర్యలు
- రెండు రోజుల్లో నీటి సమస్య పరిష్కరిస్తామని అధికారుల హామీ
- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-యాదమరి: అటవీ ప్రాంతానికి సమీపంలో నివాసం ఉంటున్న దాసర్లపల్లి ఎస్టీ కాలనీ వాసుల ఇబ్బందులు అనేకం. వారి ఇబ్బందులపై సోమవారం ప్రజాశక్తిలో 'అభివృద్ధికి ఆమడ దూరం' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఉషారాణి దాసర్లపల్లి ఎస్టీ కాలనీని మంగళవారం సందర్శించారు. అక్కడి ప్రజలతో మాట్లాడారు. కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేతి పంపు, తాగునీటి బోరు మరమ్మతులకు గురైందని, వీధి దీపాలు వెలగడం లేదని, గ్రామంలో సిమెంటు రోడ్డు కావాలని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి బోరు, చేతి పంపు రెండు రోజుల్లో మరమ్మతులు చేయిస్తామని, వీధి లైట్లు రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఉన్నతాధికారులకు నివేదించి సిమెంటు రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విలువలు వలువలు వంటివి

- శతావధాని అముదాల మురళి

పుస్తకాలను అందిస్తున్న ఆముదాల మురళి

ప్రజాశక్తి-పలమనేరు: విలువలు వలువలతో సమానమని శతావధాని ఆముదాల మురళి అన్నారు. పలమనేరు బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం అమృతభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు 'వివేకానందుని జీవితం - ఆదర్శాలు' అనే పుస్తకాలు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల మస్తిష్కం వికసిస్తుందన్నారు. రామకృష్ణ సేవాసమితి తిరుపతి (పుదిపట్ల) వారు రూ.20వేల విలువ చేసే శానిటరీ నాప్కిన్‌లను కాల్చే రెండు యంత్రాలను పాఠశాలకు అందించారు. కార్యక్రమంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసినాధం నాయుడు, రామకృష్ణ, అన్యత్, అఖిల్, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి ఉపాధ్యాయిలు పాల్గొన్నారు.

రూ.175 కోట్లతో నీవానది రిటైనింగ్ వాల్

నదీ పరివాహక ప్రాంతాల్లో ఎమ్మెల్యే క్షేత్రస్థాయి పర్యటన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వర్షాలు కురిసిన పుడల్లా.. నీవా నది పరివాహ ప్రాంతాల్లోని ప్రజలు తమ ఇళ్లలోకి నీరు వస్తాయనే భయంతో జీవిస్తున్నారని.. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్క రించడానికే రూ.175 కోట్లతో నీవా నదికి రిటై నింగ్ వాల్ నిర్మించడానికి అంచనాల రూపొం దించి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకి విన్న వించడం జరిగిందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. మంగళవారం నగరం లోని నీవానది పరివాహక ప్రాంతాలైన తేనెబండ, తేనెబండ రోడ్డు, వీరభద్ర కాలనీ, వీరభద్ర ఆలయం, సంతపేట లిల్లీ బ్రిడ్జి, మీసేవ రోడ్డు, కట్టమంచి రిక్షాకాలనీ ప్రాంతాల్లో ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పర్యటించారు. నివా నదిపై ఉన్న పలు కల్వర్టర్లు, వంతెనలను నడిచి వెళ్లి తనిఖీ చేశారు. నదిలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వీధుల్లో తిరుగుతూ.. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకని అక్కడికక్కడే అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. స్థానిక ప్రజలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న నీవానదిని పూర్తిస్థాయిలో ఆధునికరించడానికి కృషి చేస్తా న్నారు. పాడైపోయిన కల్వర్టలను నిర్మిస్తామని, ప్రజల రాకపోకలకు ఎలాంటి అసౌకర్యం లేకుం డా రోడ్లు నిర్మిస్తామన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో నీవా నదిలో నీటిమట్టం పెరిగినా స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదనే లక్ష్యంతో ఎక్కడికక్కడ పూడిక, ముళ్లపొదలు తొలగించడం, నది వెడల్పు చేసే పనులు వేగంగా చేస్తున్నట్లు చెప్పారు. తద్వారా నీరు పక్కనున్న ఇళ్లల్లోకి రాకుండా ప్రజలకు ఇబ్బంది ఉండదన్నారు. కల్వర్టర్లు, వంతెనల వద్ద నీరు నిల్వచేరకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వీరభద్ర కాలనీలోని దోబీఘాట్‌ని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. సంతపేట మీసేవ వీధిలో పర్యటించారు. మీసేవా కేంద్రం వద్ద సాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానిక మహిళలు ఫిర్యాదు చేయగా.. పోలీసులతో మాట్లాడి చర్యలు గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రిక్షా కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ఎంహెచ్వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ప్రాణాంతక వ్యాధి క్యాన్సర్ నిరోధానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం మండల పరిధిలోని అగర మంగళం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బెంగళూరుకు చెందిన సోమల రాజు ఫౌండేషన్ వారి సౌజన్యంతో రూరల్ యాక్షన్ ద్వారా నోట్ బుక్స్‌ను పంపిణీ చేసి, తర్వాత ఈ సదస్సు నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్ శివరాజు, డేనియల్, శ్రీధర్, పాఠశాల హెచ్ఎం రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీరాములు నాయుడు సమాజానికి మార్గదర్శకం

- మాజీ మంత్రి నారాయణస్వామి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కృపాలక్ష్మి
- మెడికల్ క్యాంప్, అన్నదానం

ప్రజాశక్తి వెదురుకుప్పం/ కార్వేటినగరం: మాజీ జెడ్పిటిసి రాయలచెరువు శ్రీరాములునాయుడు చేసిన సేవలు మరువలేమని మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, వైసిపి జీడి నెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కృపాలక్ష్మీ అన్నారు. మంగళవారం శ్రీరాములు నాయుడు వర్ధంతి సందర్భంగా గాండ్లమిట్ట కూడలి వద్ద దివంగత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీరాములు నాయుడు ప్రతి ఒక నేతకు మార్గదర్శకమని కొనియాడారు. మారుమూల ప్రాంతం నుంచి న్యాయం కావాలని ఆయన ఇంటి తలుపు తడితే, వారి వెంట వెళ్లి న్యాయం చేసేవాడు, పేదల పక్షాన నిలిచేవాడు, నీతికి న్యాయానికి పేరు ప్రతిష్టలు తెచ్చిన నాయకుడని అభివర్ణించారు. కార్వేటినగరం మండల అభివృద్ధికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. అందరి హృదయాలలో మంచి పేరు సంపాదించుకున్న ఏకైక వ్యక్తి శ్రీరాములు నాయుడు అని పేర్కొన్నారు. సింగల్ విండో అధ్యక్షులుగా, గ్రామ సర్పంచిగా, టెలికం మెంబర్, కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయ చైర్మన్‌గా, శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ అధ్యక్షులుగా పనిచేశారని, అందరి మన్ననలను పొందిన వ్యక్తి అన్నారు. ఎంపీపీ లతాబాలాజీ ఆధ్వర్యంలో వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు.

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నారాయణస్వామి

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, మాజీ మంత్రి

ఉచిత వైద్య శిబిరం

తిరుపతి డెంటల్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ జయ ప్రసాద్, జ్యోతిర్మాయ వైద్య నిపుణుల వైద్య శిబిరాన్ని మాజీ మంత్రి నారాయణస్వామి, ఎంపీపీ లతబాలాజీ ప్రారంభించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారుగా వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమం ఎంపీపీ లతా బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధనంజయ వర్మ, మండల వైసీపీ కన్వీనర్లు శేఖర్ రాజు, పద్మనాభ రెడ్డి, సర్పంచులు గుణవతి లోకనాథం నాయుడు, మంగమ్మ, పట్నం ప్రభాకర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి దేవకీ లోకనాథరెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు లోకనాథరెడ్డి, కృష్ణ యాదవ్, మోహనమ్మ, ఆకుల గోపి, జెడ్పిటిసి సుకుమార్, సుగుణమ్మ, గిరిజ, యశోద రెడ్డి, వెదురుకుప్పం ఎంపీపీ బండి నాగరాణి హేమసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అంగన్వాడీ కేంద్రం

- అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి
- టీడీపీ నేత కన్నన్ సూచన

అంగన్వాడీ భవనాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

భవనం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

ప్రజాశక్తి-కుప్పం రూరల్: అధ్వానంగా ఉన్న అంగన్వాడి కేంద్రానికి మోక్షం కల్పించాలని టిడిపి కుప్పం నియోజకవర్గ విస్తరణ విభాగం కమిటీ సభ్యులు కన్నన్, కొత్తపేట యూనిట్ ఇన్‌ఛార్జ్ ముఖేష్ (అప్పు)లు కోరారు. మంగళవారం వారు కొత్తపేట అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి, పెచ్చులూడుతున్న భవనాన్ని చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్వాడీ భవన పరిస్థితిని చిన్నారుల తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. వారి విజ్ఞప్తి మేరకు భవనాన్ని పరిశీలించగా పెచ్చులూడుతున్న పై కప్పుతో భవన పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్ర పరిస్థితిని స్థానిక అధికారులు పట్టించుకోక పోవడం వల్లే ఇలాంటి పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే చిన్నారుల పరిస్థితిని తలుచుకుంటే భయం వేస్తుంది అంటూ, అధికారులు సరైన సమయంలో స్పందించాలన్నారు. వెంటనే కొత్తపేటలోని అంగన్వాడీ కేంద్ర భవనాన్ని మరమ్మతులు చేయించాలని కోరారు. అంతవరకు భవనాన్ని తాత్కాలికంగా వేరొక చోట నిర్వహించే ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైతే స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని అంగన్వాడీ కేంద్రానికి ఉపయోగించుకునే అవకాశాన్ని అధికారులు పరిశీలించాలని సూచించారు. స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గత ప్రభుత్వ హయాంలో నూతన భవనాన్ని నిర్మించి అక్కడికి మార్చడం జరిగిందని తెలిపారు. కావున పాత ఆరోగ్య కేంద్ర భవనాన్ని అంగన్వాడీ కేంద్రానికి ఉపయోగించుకునే అవకాశం ఉందని సూచిస్తూ, అధికారులు వెంటనే చర్యలు చేపట్టి, చిన్నారులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-పూతలపట్టు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం పాఠశాల స్థాయిలోని అండర్ 14 హ్యాండ్ బాల్ క్రీడల పోటీలను నిర్వహించారు. జిల్లాలోని నలుమూలల నుంచి సుమారు 120మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా వ్యాయామ సంఘం కార్యదర్శి రవీంద్రారెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంత ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలు జరిగాయి. ఇందులో బాలుర విభాగంలో 16మంది, బాలికల విభాగంలో 15మంది సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కలకడ మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈనెల 22 నుంచి 28వరకు గుంటూరు జిల్లాలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధం చేయనున్నట్లు పీడీలు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు కృష్ణయ్య, ఢిల్లీ రాణి, ప్రసాద్ జయకృష్ణ, నాగరాజు, ప్రభాకర్, శివ ప్రసాద్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

- ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు మునిరత్నం

మెప్మా మార్కెట్ ప్రారంభించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: మహిళల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని ఎంఆర్ రెడ్డి కూడలిలో వద్ద మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎంతగానో సహకరిస్తున్నారని తెలిపారు. గతంలో మహిళా గ్రూపులను ఏర్పాటు చేసిన ఆయన గ్రూపు సభ్యులకు బ్యాంకు రుణాలను అందించడంతో పాటు మహిళలు స్వయం ఉపాధిని సాధించే విధంగా ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా మహిళలు స్వయంగా వస్తువులను ఉత్పత్తి చేసి, వాటిని అమ్ముకుని, సొమ్ము చేసుకునే వెసులుబాటు కల్పించారని తెలిపారు. మహిళలు తయారుచేసిన వస్తువులను నేరుగా అమ్ముకోవడానికి మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభించినట్టు తెలిపారు. ఈ మార్కెట్ నెలలో ఒక్కరోజు ప్రజలకు అందుబాటులో ఉంటుందని, వాటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజ్ కుమార్, సోము, సురేష్, ఆర్ముగం, జయరాం, బాలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎంపీటీసీ జగన్నాథరాజు కిడ్నాప్

- జీడీ నెల్లూరు స్టేషన్‌లో కేసు నమోదు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: టిడిపి ఎంపీటీసీ జగన్నాథరాజు సోమవారం రాత్రి అంబోదరపల్లెకు సమీపంలో కొంతమంది వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లు ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు జీడీ నెల్లూరు సిఐ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సి ఐ కథనం మేరకు. పాలసముద్రం మండలం నరసింహ పురం పంచాయతీ టీవిఎన్ఆర్ పురం గ్రామానికి చెందిన జగన్నాథరాజు ఆ పంచాయతీకి ఎంపీటీసీగా పదవిలో కొనసాగుతున్నారు. ఈయన గత కొన్నేళ్ల క్రితం విజయవాడ ప్రాంతం నూజివీడు చెందిన ఫైనాన్స్ వాళ్ళ దగ్గర జెసిబి తీసుకొచ్చాడు. అయితే జగన్నాథరాజు ఫైనాన్స్ వాళ్లకు కంతులు సరిగా కట్టలేదని చెప్పి ఏకంగా వారు ఐదు మంది కలిసి విజయవాడ నుంచి సోమవారం ఓ వాహనంలో మండలానికి చేరుకున్నారు. ఫైనాన్స్ వారు జగన్నాథరాజుకు ఫోన్ చేసి అతను ఎక్కడ ఉండేది తెలుసుకోగా చిత్తూరు నుంచి పాలసముద్రం మండలంలోని టీవీఎన్ఆర్ పురం వెళుతున్నానని సమాచారం ఇచ్చారు. అయితే వారు జీడీ నెల్లూరు మండలం ఆంబోదర పల్లెకు సమీపంలో కాపుగాచి జగన్నాథరాజును వారి వెంట తెచ్చుకున్న వాహనంలో కిడ్నాప్ చేసుకొని విజయవాడకు తరలించారు. కాగా జగన్నాథరాజు వద్ద జెసిబి డ్రైవర్‌గా పనిచేస్తున్న శంకర్ జీడీ నెల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసు విషయంగానే విజయవాడకు బయలుదేరుతున్నట్లు సీఐ పేర్కొన్నారు. కాగా కేసులో వీరేష్, శివ, నాగరాజు, మణి, చంద్రాలపై కేసు నమోదు చేశామని వీరితో మరో కొందరు ఈ కిడ్నాప్ కేసులో ఉన్నట్లు సీఐ వివరించారు.

ఈచర్‌ను ఢీకొన్న లారీ బోల్తా

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఈచర్ వాహనాన్ని ఢీకొని లారీ బోల్తాబడ్డ సంఘటన సోమవారం రాత్రి మొగిలి ఘాట్లో చోటు చేసుకుంది. పలమనేరు నుంచి చెన్నైకి టమేటా లోడుతో వెళ్తున్న ఈచర్ వాహనాన్ని బెంగళూరు నుంచి చిత్తూరుకి బియ్యం లోడ్‌తో వస్తున్న లారీ ఈచర్‌ను వెనక భాగంలో ఢీకొంది. బియ్యం లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: పిడుగుపాటుకు గురై పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని దేవదొడ్డి పంచాయతీ కామినాయని పల్లిలో చోటుచేసుకుంది. మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. అకస్మాత్తుగా పిడుగు పడటంతో గ్రామానికి చెందిన పాడి రైతు సుబ్రమణ్యంకి చెందిన పాడి ఆవు మృతి చెందింది. సుమారు రూ.92వేల నష్టం కలిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పూటకు 12లీటర్ల పాలు ఇచ్చే ఆవు మృతి చెందడంతో ఆ రైతు తీవ్ర ఆవేదనకు లోనైయ్యారు. ప్రభుత్వ పరంగా సాయం అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-పూతలపట్టు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పూతలపట్టు మండలం కాణిపాకం క్రాస్ వద్ద చోటుచేసుకుంది. తవణంపల్లి మండలానికి చెందిన భరత్ రాజ్ మంగళవారం రాత్రి చిన్న కలికిరి సమీపంలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం వద్దకు వచ్చి పూజలు నిర్వహించి తిరిగి స్వంత గ్రామానికి వెళుతుండగా కాణిపాకం క్రాస్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పూతలపట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరిన్ని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.